క్లుప్తంగా

మద్యం దుకాణాలకు 199 దరఖాస్తులు

ములకలచెరువు: ములకలచెరువు సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో 9 మద్యం దుకాణాలకు 199 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సీఐ మాధవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ములకలచెరువు మండలంలోని 3 షాపులకు 77 దరఖాస్తులు, తంబళ్లపల్లె మండలంలో 2 షాపులకు 40 దరఖాస్తులు, పెద్దమండ్యంలో 2 షాపులకు 41 దరఖాస్తులు, పీటీఎం లో 2 షాపులకు 41 దరఖాస్తులు అందినట్లు సీఐ పేర్కొన్నారు.

కిటకిటలాడిన బస్టాండ్లు



ప్రయాణికులతో కిటకిటలాడిన బెంగళూరు బస్టాండు

మదనపల్లె సిటీ: దసరా సెలవులు ముగియడంతో బస్టాండులు ప్రయాణికులతో కిటకిటలాడాయి. స్థానిక బెంగళూరు బస్టాండు, ఆర్టీసీ బస్టాండుల్లో బస్సుల కోసం ప్రయాణికులు సందడి కన్పించింది. బెంగళూరుకు వెళ్లేవారు బస్సు సీట్ల కోసం పడరానిపాట్లు పడ్డారు. ఆర్టీసీ ప్రయాణికుల కోసం అదనపు సర్వీసులు నడిపారు.

120 మందికి కంటి పరీక్షలు



ఉచిత కంటి అద్దాలు పొందిన వృద్ధులు

పీలేరు : స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 120 మందికి కంటి పరీక్షలు చేసినట్లు మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీశంకర్ తెలిపారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయం వైద్యులు సహకారంతో వైద్య శిబిరం నిర్వహించినట్లు మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరిశంకర్, సీఈవో సీతారామనాయుడు తెలిపారు. 120 మందికి కంటి పరీక్షలుచేసి 40 మందికి మందులు పంపిణీ చేసినట్ల తెలిపారు. 18 మంది ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. 15 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సీఈవో సీతారామనాయుడు, ట్రస్ట్ ఏవో కృష్ణ గల్లా పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపును మరచిన ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎస్టీయూ నేత రఘునాథరెడ్డి

రాయచోటి అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొన్ని సంవత్సరాలుగా చెల్లించాల్సిన బకాయిలను కూటమి ప్రభుత్వం మరచిపోయిందని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లూరు రఘునాథరెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటిని ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ సర్వీసు మొత్తం దాచుకున్న డబ్బునుంచి పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ లోన్‌లు, ఫైనల్ పేమెంట్స్, ఆర్జిత సెలవుల నగదు చెల్లింపులలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుండడం దారుణమన్నారు. దాచుకున్న డబ్బులు పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇళ్లు నిర్మాణాలకు ఉపయోగపడుతుందని ఆశించిన ఉద్యోగులకు నిరాశే ఎదురవుతోందన్నారు. న్యాయపరంగా తమకు అందాల్సిన బకాయిలు అత్యవసరాలకు అందివ్వకుండా సంవత్సరాల తరబడి పెండింగ్‌లో పెట్టడం ఏమిటంటూ ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగారెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులను వెంటనే చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు యాప్‌ల నిర్వహణ భారాన్ని తగ్గించి వాటి నిర్వహణకు ప్రతి పాఠశాలకు ఒక డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలంటూ కోరారు. అన్నమయ్య, సత్యసాయి జిల్లాల అధ్యక్షులు శివారెడ్డి, హరిప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ పీఆర్సీ ప్రకటన ఆలస్యమవుతున్న నేపథ్యంలో వెంటనే ఉద్యోగులకు 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని, 117 జీఓను రద్దుచేయాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు పనిసర్దుబాటు అసంబద్ధాలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ సీనియర్ నేత రవీంద్రనాథరెడ్డి, నేతలు మురళికుమార్, సుధాకర్, రామాంజులు, గోపిక్రిష్ణ, రెడ్డెయ్య, నాగరాజు, శివశంకర్, కృష్ణారెడ్డి, రమణయ్య, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నుందుపల్లె : మండల కేంద్రానికి సమీపంలోని ఏటిగడ్డ రాచపల్లి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ఆర్ఆర్ ట్రేడర్స్ నిర్వాహకులు అజయ్‌రెడ్డి రూ.20,116లు నగదును అందజేసినట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. గ్రామస్తులు రెడ్డయ్య రాజు, గంగరాజు పాల్గొన్నారు.

పెద్దపాళ్యం ఆర్‌ఓబీకి కొత్త అందం

- 64 మీటర్ల పొడవుతో భారీ బౌ స్ట్రింగ్
- హైడ్రాలిక్ జాక్స్‌తో ఆర్‌ఓబీపైకి
- ఆర్‌ఓబీపై అమర్చేందుకు సిద్ధం
- రూ.63.79 కోట్లతో నాలుగులేన్ల బిడ్జి
- రూ.49.10 కోట్ల పనులు పూర్తి



అమర్చేందుకు సిద్ధమైన 500 టన్నుల బరువైన బౌస్ట్రింగ్



బౌస్ట్రింగ్ అమర్చనున్న బ్రిడ్జి

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇప్పటికే రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జి ఆర్‌ఓబీల పనులు పూర్తయి ప్రారంభమవగా, ములకలచెరువు మండలం పెద్దపాళ్యం రైల్వే లైనుపై నిర్మాణంలోని ఆర్‌ఓబీ వీటికి భిన్నంగా ప్రత్యేక టెక్నాలజీతో ఎక్కువ పొడవు కలిగిన బౌ స్ట్రింగ్స్‌ను ఆర్‌ఓబీపై అమర్చేందుకు కాంట్రాక్టర్ సంస్థ సిద్ధమవుతోంది. నాలుగేళ్ల క్రితం వరకు నియోజకవర్గంలోని బి.కొత్తకోట, కురబలకోట, ములకలచెరువు మండలాల్లో సాగే రైల్వే మార్గంపై ఆర్‌ఓబీలు లేవు. తర్వాత ఒకేసారి మూడు మంజూరవగా రెండు పూర్తయి కేంద్రమంత్రి నితిన్ గడ్కరి ప్రారంభోత్సవం చేశారు. అయితే పెద్దపాళ్యం వద్ద నిర్మాణంలోని ఆర్‌ఓబీ పనుల విషయంలో సాంకేతిపరమైన ఇబ్బందులు తలెత్తాయి. దీనితో డిజైన్‌లో మార్పులు చేయాల్సి వచ్చింది. రెండు ఆర్‌ఓబీలను కాంక్రీటు నిర్మాణాలతో పూర్తి చేశారు. పెద్దపాళ్యం ఆర్‌ఓబీపై బౌస్ట్రింగ్ ఏర్పాటు చేయాల్సి వచ్చింది. దీనితో ఏడాదికి పైగా పనులు ఆగిపోయాయి. డిజైన్ల మార్పుతో పనులు మొదలవగా ఒకవైపు అమర్చే బౌస్ట్రింగ్ పనులు పూర్తయి అమర్చేందుకు సిద్ధంగా ఉంది.

64 మీటర్ల పొడవుతో విల్లు ఆకారంలో..

ఆర్‌ఓబీలపై విల్లు ఆకారంలో ఇనుముతో తయారు చేసే బౌస్ట్రింగ్‌ను ఏర్పాటు చేస్తుంటారు. తిరుపతి ఎస్వీయూ వద్ద 46 మీటర్ల బౌస్ట్రింగ్‌ను ఏర్పాటు చేశారు. పెద్దపాళ్యం వద్ద ఆర్‌ఓబీపై 64 మీటర్ల పొడవుతో నిర్మించారు. దీని వెడల్పు 12.5 మీటర్లు కాగా ఫుట్‌పాత్ కోసం 1.5 మీటర్లు కేటాయించారు. నాలుగు లైన్ల ఆర్‌ఓబీలో రాకపోకలకు రెండు లైన్లతో రెండు రహదారులుంటాయి. ప్రస్తుతం ఒకవైపు అమర్చే రెండు లైన్ల విల్లు ఆకారం బౌస్ట్రింగ్ నిర్మించేందుకు 500 టన్నుల ఇనుమును వినియోగించారు. ఈ పనులు పూర్తి చేసేందుకు ఆరునెలల సమయం పట్టింది. దీన్ని రెండువైపులా ఖాళీగా ఉన్న ఆర్‌ఓబీపై అమర్చాలి. ఈ పనిని రైల్వేశాఖకు చెందిన రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ పరిశీలించి ఆమోదం తెలపగానే పని మొదలు పెడ్తారు. దీన్ని ఎత్తి పెట్టేందుకు 300 టన్నుల బరువును పైకి ఎత్త గలిగే హైడ్రాలిక్ జాక్స్‌ను నాలుగింటిని రప్పిస్తున్నారు. నాలుగు వైపులా నాలుగు జాక్స్ కిందనుంచి పైకి ఎత్తి ఆర్‌ఓబీపై అమర్చనున్నారు. దీనికోసం కాంట్రాక్టు సంస్థ చర్యలు చేపట్టింది. ఈ పని అయ్యాక రెండో వైపు మరో 500 టన్నులతో మరో బౌస్ట్రింగ్‌ను నిర్మించి ఏర్పాటు చేస్తారు.



పూర్తయిన నాలుగులైన్ల ఆర్‌ఓబీ

రూ.63 కోట్లతో పనులు :

పెద్దపాళ్యం వద్ద నాలుగులైన్ల ఆర్‌ఓబీ నిర్మాణం కోసం రూ.63.79 కోట్లతో బెంగళూరుకు చెందిన క్రిషి ఇన్‌ఫ్రాటెక్ కాంట్రాక్టు సంస్థ పనులు దక్కించుకొంది. 1.700 కిలోమీటర్ల పొడవున బ్రిడ్జి నిర్మించి, అండర్ ప్యాసెజ్, ఇతరా కాంక్రీటు పనులు పూర్తి చేయాల్సివుంది. ఇందులో బౌస్ట్రింగ్ అమర్చడం మినహా బ్రిడ్జి పనితో 90శాతం పనులు పూర్తిచేశారు. రూ.63.79 కోట్ల పనిలో రూ.49.10 కోట్ల పనులు పూర్తి చేశామని మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయనున్నామని ప్రాజెక్ట్ మేనేజర్ బాలాజీ తెలిపారు.

జిమ్మి చెట్టుకు పూజలు

పెద్దతిప్పసముద్రం: దసరా పండుగ సందర్భంగా స్థానిక శివాలయం వద్ద సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో శనివారం జిమ్మి చెట్టుకు పూజలు చేసి వాటి ఆకులను భక్తులకు పంచి పెట్టారు. అనంతరం పార్వతీ దేవి ప్రతిమకు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించి వేద మంత్రాలతో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేటి నుంచి 'పల్లెపండుగ'

కేవీపల్లె : మండలంలోని సోమవారం నుంచి అన్ని గ్రామ పంచాయతీలలో పల్లెపండుగ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో సుధాకర్ తెలిపారు. సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు పండుగ వాతావరణంలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్ట్

పీలేరు రూరల్ : పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. వివరాలిలావున్నాయి. మండలంలోని ముడుపులవేముల పంచాయతీ ఠాణావడ్డిపల్లె సమీపంలో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేశారు. జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 10,850 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నతస్థానం

మదనపల్లె సిటీ: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునని హైదరాబాద్ ఇన్‌కమ్‌ట్యాక్స్ అడిషనల్ కమిషనర్ బి.యాదగిరి అన్నారు. ఆదివారం స్థానిక కదిరిరోడ్డులోని ఓ ఫంక్షన్‌హాలులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కురబ విద్యార్థులకు ఆత్మీయ సన్మానం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి దశలోనే ఏం చదువుకోవాలనేది డిజైన్ వేసుకోవాలన్నారు. తాము ఏ వృత్తిలో రాణిస్తామే దాన్ని ఎంపిక చేసుకోవాలన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో పట్టు సాధిస్తే మంచి ఫలితం వస్తుందన్నారు. కురబకులస్థులు గతంలో చదువులో చాలా వెనుబడి ఉండేవారన్నారు. ప్రస్తుతం చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. కురబ కుల విద్యార్థులకు ఉచితంగా సివిల్ కోచింగ్‌లో ఇస్తానని హామీ ఇచ్చారు. దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డు ఇండియన్ ఎయిర్ ఫోర్సు గ్రూపు కెప్టెన్ కె.పరంథామగౌడ్, రిటైర్డు ప్రొఫెసర్ డాక్టర్ వెంకట్రామయ్య, విద్యుత్‌శాఖ డిప్యూటీ ఈఈ హరికుమార్, డివిజన్ అధ్యక్షులు ఆర్.కె.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి మంత్రిపాటి రమేష్, గౌరవ అధ్యక్షులు కప్పల నాగరాజ, రుద్రయ్య, దండు రామాంజులు, రెడ్డప్ప, రమణ, నరసింహులు, మల్లయ్య, శ్రీనివాసులు, సదాశివ, బెల్లే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ప్రతిభ కనబరిచిన మల్లికార్జునకు మెమెంటో అందజేస్తున్న ఐఆర్ఎస్ అధికారి యాదగిరి, కురబ సంఘం నాయకులు

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

– ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా, ప్రజలకు అవసరమైన మౌలికవసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతున్నామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే ఇంటివద్ద నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు మంజూరయ్యాయన్నారు. సుమారు 1.5 కోట్ల వ్యయంతో గ్రామాల్లో కాలువలు నిర్మించే పనులు స్థానిక నాయకులకే ఇస్తున్నామన్నారు. వీటన్నంటినీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉంటూ నాయకులు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని, పరిష్కారం కోసం ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరుగుతున్నారన్నారు. స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులు ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కారం దిశగా కృషిచేసినప్పుడే ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కదిరి రోడ్డు నుంచి బెంగళూరు రోడ్డుకు ఇంటర్‌లింక్(బైపాస్‌రోడ్డు) మంజూరైందన్నారు. దీంతో సగానికి పైగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాదెళ్లవిద్యాసాగర్, రాటకొండ గుర్రప్పనాయుడు, నవీన్‌చౌదరి, బాలుస్వామి, శ్రీరామవినోద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఉలవల గంగమ్మకు వెండి కిరీటం

పీలేరు రూరల్ : మండలంలోని తలపుల పంచాయతీలో ఉన్న ఉలవల గంగమ్మ అమ్మవారికి స్థానిక కడప రోడ్డుకు చెందిన తువపల్లె రెడ్డెమ్మ, సురేందర్ రెడ్డి దంపతలు వెండి కిరీటం వితరణ చేశారు. విజయదశమి పురస్కరించుకుని శనివారం అమ్మవారికి వెండి కిరీటం బహూకరించారు. ఆలయ చైర్మన్‌లు మల్లికార్జుననాయుడు, వెంకటరమణనాయుడు, సాగర్‌రెడ్డిలకు అందజేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



వెండి కిరీటం అందజేస్తున్న దాతలు

పర్యవేక్షణ లేకపాయె.. చెత్త నిలిచిపాయె



ఆర్టీసీ బస్టాండ్ ఆటో స్టాండ్ వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం



ఎల్‌బీఎస్ రోడ్డులో దుర్గంధం వెదజల్లుతున్న కాలువ

పీలేరు : పీలేరు పట్టణంలో ఎటు చూసినా పారిశుద్ధ్యం కొరవడి చెత్త దిబ్బలు దర్శనమిస్తుండడంతో ఇలా అయితే రోగాలు రావా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇటీవలే స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం చేపట్టి ప్రచార ఆర్భాటం చేశారు. శుభ్రత పాటిస్తేనే ఆరోగ్యంగా ఉండగలమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం చేపట్టారు. అయితే అందుకు భిన్నంగా పీలేరు పట్టణంలో చెత్తా చెదారం, మురుగునీటి కాలువలు అస్థవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్య కార్యక్రమాలపై అధికారులు దృష్టి సారించకపోవడం, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడడంతో ఎటు చూసినా పారిశుద్ధ్యం లోపించి దోమలు వృద్ధి చెందుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. విషజ్వరాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్నందున ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నారు.



ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చెత్తాచెదారం



చెన్నారెడ్డి వీధిలో..

పరిమళించిన మానవత్వం

మదనపల్లె సిటీ: ఓ దినసరి కూలీ అనారోగ్యంతో మృతి చెందడంతో స్థానికులు అందరూ కలిసి హిందూ సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్నారు. మదనపల్లె పట్టణం సైదాపేటకు చెందిన వేణు(50) దినసరికూలీగా బెంగళూరు బస్టాండులో పని చేస్తూ జీవిస్తున్నాడు. తల్లిదండ్రులు, పిల్లలు కర్ణాటక రాష్ట్రం మురగముల్లాలో ఉంటున్నారు.. శనివారం రాత్రి బస్టాండు వద్ద వేణు ఆస్మాత్తుగా కిందపడిపోయాడు. తలకు పెద్ద గాయం కావడంతో మృతి చెందాడు. ఉదయం స్థానికులు గుర్తించి విషయాన్ని వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషాకు తెలియజేశారు. బంధువులు రాలేకపోవడంతో వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా అంత్యక్రియలు చేసేందుకు ముందుకు వచ్చారు. స్థానికులు ముస్లింలు కలిసి హిందూ సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు జరిపించారు. సీఐ స్వయంగా పాడి మోసి మానవత్వం చాటుకున్నారు.



పాడి మోస్తున్న వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



మదనపల్లె: ధనలక్ష్మిగా వాసవీ అమ్మవారు



పీలేరు: రాజరాజేశ్వరిదేవి అలంకరణలో యల్లమ్మతల్లి



కలికిరి: రాజరాజేశ్వరిగా ఎల్లమ్మతల్లి



వాల్మీకిపురం: కన్యకా పరమేశ్వరీ



ములకలచెరువు: వెండికవచం అలంకరణ



గుర్రంకొండ : గంగమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు

మదనపల్లె సిటీ: దసరా ఉత్సవాలు ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకోవటానికి భక్తులు పోటెత్తారు. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొగటవీరక్షత్రియ మహిళా సంఘం ఆధ్వర్యంలో భక్తాదులకు పసుపు, కుంకుమ,గాజులు, పసుపు దారాలు అందజేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. తొగల వీరక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ కనబచిరిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. అమ్మవారి చీరలు పంపిణీ చేశారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో శ్రీ లలితాత్రిపురసుందరిదేవి అమ్మవారిని విజయ చాముండేశ్వరి అలంకారంలో అలంకరించారు. స్థానిక కోర్టు ఆవరణంలో గంగమ్మ అమ్మవారికి బంగారు కిరీటం ధరింపజేసిభక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అలాగే స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ఉదయం ఉత్సవ విగ్రహాలు పూజలు చేశారు. సాయంత్రం జమ్మి చెట్టుకు పూజలు చేశారు.

ధనలక్ష్మి అలంకారంలో వాసవీ అమ్మవారు

దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక వాసవీభవన్‌వీధిలోని శ్రీ వాసవీ కన్యాకా పరమేశ్వరి అమ్మవారిని శ్రీ ధనలక్ష్మి అలంకారంలో అలంకరించారు. సుమారు రూ.80 లక్షల డబ్బులతో చేసిన అలంకారం భక్తులను ఆకట్టుకుంది.

వాహనాలకు పూజలు

విజయదశమి సందర్భంగా వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. లారీలు, బస్సులు, జీపులు,ద్విచక్రవాహనాలకు శుభ్రం చేసి పూలు అలంకరించి గంగమ్మ వద్ద పూజలు నిర్వహించారు.

పీలేరులో..

పీలేరు : విజయదశమి సంబరాలు పీలేరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక మోడల్ కాలనీలో చివరి రోజు శనివారం యల్లమ్మ అమ్మవారిని సూర్యప్రభ అలంకరణ మధ్య రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలాగే స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు, అలంకరణ నిర్వహించారు. అలాగే స్థానిక రౌద్రాల అంకాలమ్మ ఆలయంలోనూ విశేష పూజలు నిర్వహించారు.

ముగిసిన శరననవరాత్రి ఉత్సవాలు

కలికిరి: శరన్నవరాత్రి ఉత్సవాలు మండలంలో శనవారంతో ముగిశాయి. కలికిరి గ్రామదేవత ఎల్లమ్మ శనివారం భక్తులకు శ్రీరాజరాజేశ్వరి రూపంలో దర్శనమిచ్చారు. పార్వతీసమేత సోమేశ్వరాలయంలో దుర్గాదేవి అమ్మవారిని ప్రతిష్టించి తొమ్మిది రోజుల పాటు పూజలు, అలంకారలు ఏర్పాటు చేశారు. ఆదివారం దుర్గామాత విగ్రహాన్ని వైభవంగా గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం చేశారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారు పురువీధులలో ఊరేగారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో విజయదశమి పండుగ వేడుకలను ఘనంగా జరపుకొన్నారు. ఆదివారం పలు ఆలయాల్లో అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. స్థానిక షిరిడినగర్‌లోని శ్రీ సాయిబాబా ఆలయంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకొన్నారు. సాయిబాబాను పట్టణంలోని పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరీ ఆలయంలో విజయదశమి సందర్భంగా అమ్మవారికి ఘనంగా పుష్పయాగం నిర్వహించారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ: మండలకేంద్రంలో దసరా ఉత్సవాల సంబరాలు ముగిశాయి. చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి, గుర్రంకొండ గ్రామదేవతలైన శ్రీ పోలేరమ్మతల్లి,శ్రీ గంగమ్మతల్లి, శ్రీకన్యకా పరమేశ్వరీ తల్లులు శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గంగమ్మతల్లి ఆలయంలో ఆలయఅర్చకులు కిరణ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా చక్రస్నానం

చెర్లోపల్లెలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో చక్రస్నానం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో చివరిరోజైన ఆదివారం రోజు అమ్మవారిని శాస్త్రోక్తంగా ఆలయ దిగువభాగాన ఉన్న కోనేటి వద్దకు మేళతాళాలతో తీసుకొచ్చారు. కోనేట్లో అమ్మవారికి చక్రసాన్నం కావించారు.

ములకలచెరువులో..

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రంలోని శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో శనివారం విజయదశమి వేడుకలు మహిళలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వెండి కవచంతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యంలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: తంబళ్లపల్లెలో విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక శివాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పార్వతిదేవిని కొలువుదీర్చారు. శనివారం అర్చకులు మహేష్ అమ్మవారికి లక్ష్మిదేవి అలంకరణతో పూజలు,అభిషేకాలు నిర్వహించి భక్తులు అమ్మవారి దర్శనం కల్పించారు.